## శ్రీదాసగణుకృత శ్రీసంత కథామృతం
## 57వ అధ్యాయం

శ్రీగణేశాయనమః . ఓ చిత్స్వరూపా! లంబోదరా! ఆద్యమూర్తీ! ఉదారా! నాచేతిని పట్టుకుని త్వరగా ఈ గ్రంథాన్ని రచియింప చేయి. శ్రోతలారా! వినండి. సంత కథామృతమను ఈ గ్రంథం సాక్షాత్తు వసంత ఋతువు. సత్పురుషుల కథలు మామిడి వృక్షాలు. పద్యరచన అనే కొమ్మలకు బోధరూపంలో ఫలాలున్నాయి. దీనిని సేవించటానికి మీరు కోకిలలవండి. మానస సరోవరం వంటి ఈ గ్రంథంలో పద్య రచనయే నీరు. ఈ కాసారంలో వికసించిన కమలమే సత్పురుషని కథ. ఈ కమలంలో బోదరూపంలో మకరందం ఉంది. ఈ బోధామృతాన్ని సేవించడానికి, మీరంతా భ్రమరాలవండి. భక్తలీలామృతమనే గ్రంథంలో, నే నిదివరకు 31, 32, 33 అధ్యాయాలలో శిరిడి గ్రామంలో నివసించిన శ్రీసాయినాథుని గురించి వర్ణించాను. వారు భక్తులకు కల్పవృక్షం. మహా ఉదారులు. దయాసాగరులు. వారు భవసాగరాన్ని దాటింప చేసే నౌక. అంతే కాదు జ్ఞాన భండారం. భక్తవత్సలుడైన ఆ సాయి సమర్థుని దర్శనానికి భక్తులు పుష్యమాసంలోని ఉత్తమ ధనుసంక్రమణ పర్వదినాన వచ్చారు.



ఈ ధనుసంక్రాంతి మకర సంక్రాతి కంటె శ్రేష్ఠమైన పర్వదినం కాదు కదా మరి భక్తులెందుకు అక్కడికి వచ్చారని మీకు సందేహంగా ఉంది కదూ. ధను సంక్రాంతి రోజు భక్తులు బాల భాస్కరునికి నైవేద్యాన్నర్పించి, ఉదయాన్నే భోంచేస్తారు. అందుచేత, అనుతాపరూపమైన చలిలో వణికి పోతూ భక్తి రూపమైన బండిలో సద్గురువును సందర్శించు కోవలెనని భక్తులు శ్రీఘ్రంగా బయల్దేరారు, ఉదయగిరి వంటి శిరిడీలో, సాయి మహారాజు బాల భాస్కరుని వలె ఉదయించాడని, ప్రభాత సమయాన సాయి కృపా గంగలో శ్రద్ధగా స్నానం చేసి సాయి సమర్థుని దర్శనానికి వెళ్లారు. సాయి ఉత్తమ మైన జ్ఞానంతో పక్వాన్నాలు తయారు చేసి, భక్తులకై విస్తర్లలో భోజనం ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచారు. అక్కడ ధనుర్మాస మదే. అందువల్ల భక్తులు ఆ పర్వదినం అక్కడ భోజనం చేయాలనే కోరికతో పరుగు పరుగున వచ్చారు. ధీరుడు, ఉదారుడు, సజ్జనుడు, గోవిందాత్మజుడు, మరియు శుచిర్భూతుడు మహాకర్మరుడు, వేద శాస్త్రాలలో అత్యంత నిష్ఠ గల హరిపంతు, బేరే, నానా, నివోాకంరు, లక్ష్మణమారుతి మొదలగు మహా భక్తులు మసీదులో సభకూడి కన్నతల్లి కనిపించగా ఆనందించే పసి పిల్లలవలె అత్యంత ఆహ్లాదంగా కూర్చున్నారు. అప్పుడు నానా తన

రెండు చేతులూ జోడించి నేనిదివరకు మిమ్మల్ని అడిగిన దానికి మీరు సమాధానం చెప్పలేదు సాయి సర్వేశ్వరా! మాపై కోపగించారా? సాయి దేవా! దేవుడసలు ఎవరు? ఎక్కడుంటాడు? ఎట్లుంటాడు? ఎట్లా లభిస్తాడు? మాకు తెలియచేయండని కోరాడు. సాయి మహారాజ "నానా! మీరంతా నా బిడ్డలు. నె నెవరినీ కోపగించను. శ్రీవెంకుశా ఉంటే మీరు నాపై అలుక వహించే విధంగా వారిపై అలిగేవాణ్ణి. సరే. నేనిది వరకు (రెండు అధ్యాయాలలో) చెప్పాను కదా దానిని బాగా గుర్తుకు తెచ్చుకో. ఆ జ్ఞానాన్ని వంట పట్టించుకుంటే సాధన చతుష్టయ సంపద లభిస్తుంది. సాధన చతుష్టయ సంపన్నుడైన శిష్యునికే బ్రహ్మజ్ఞానాన్ని బోధించి అతన్ని ఉద్ధరించాలి. సిద్ధిని సాధించటానికి, పెద్దలు ఉపాయాలు చెప్పారు. వానిని సాధనోపాయాలని అంటారు. ఈ విషయాలు చాలా కఠినమైనవి అందువల్ల ఏకాగ్రమనసుతో శ్రద్ధగా విను. సాధనా చతుష్టయం అంటే 1. నిత్యానిత్యవస్తువివేకం, 2. ఇహలోక పరలోక సుఖాలయందు వైరాగ్యం, 3. శమదమాదిషట్ సంపత్తి, 4. ముముక్షుత్వం. మొదటి సాధనా వ్యాఖ్యవిను - మనసులో ఎల్లప్పుడూ బ్రహ్మ ఏ సత్యం జగన్మిథ్య అన్న భావముండాలి. దాంభికులు అనేకరకాల వేషాలతో వివేకుల వలె కపటనాటక మాడి జనులను



మోసగిస్తారు. ఒకడు యాత్రీకుణ్ణని గొప్ప చెప్పుకుంటాడు. వినోదంగా విహారాలకు వెళ్లినట్లుగా పంఢరీపురానికి వెళ్లి వస్తాడు. ఆ పంఢరీ యాత్రైనా శ్రద్ధగా చేయరు. అసలా యాత్ర ఉద్దేశం - అమాయక ప్రజతమ్ము భక్తులుగా గౌరవించాలని. అంతే కాని ఏ ఒక్కడైనా ఆ పరమాత్మ ఎవరు? ఎలా ఉంటాడు? అసలెక్కడుంటాడని ఎరుగరు. లెక్కలేనన్ని గ్రంథాలు పఠించినా వారి అంతరంగం పరిశుద్ధమవదు. అయినా ఇతరులకు మాత్రం ఉపదేశాలిస్తుంటారు. అట్టివారు జ్ఞాన సరోవరంలోని కప్పలు. వారు మకరందాన్ని వదిలి, వాదవివాదాలనే బురదను సేవిస్తారు. పరులను నిందిస్తూ తమ గొప్పలను ప్రకటించుకునే వారు వివేక వంతులు కారు. వారు బ్రహ్మజ్ఞానానికి పాత్రులు కారు. రెండవ సాధన – వైరాగ్యం : ఇహ పర సుఖాల యందు ఏ కోరికా లేనట్టి వారే నిజంగా విరాగులు. శమం, దమం తితీక్ష ఉపరతి శ్రద్ధ సమాధానాలను జ్ఞానులు శమదమాది షట్ సంపత్తని అంటారు. ఇది మూడవది. శబ్ద స్పర్శ రూప రస గంధాలనే పంచ విషయాలనుండి మనసును నిగ్రహించడం శమంఇలా నిగ్రహించినా, విషయ వాసనలు మాసిపోకుండా మనసును బలీయంగా చుట్టుకునే ఉంటాయి. వానిని అదుపులో ఉంచు కోవటం లేదా తొలగించు కోవటం దమం.

తమ తమ ప్రారబ్ధ కర్మాను సారం. ప్రాప్తించిన దుఃఖానికి ఆక్రోశించకుండా సహించటమే తితీక్ష. మనసు కాంత కనకాలలో భార్యా బిడ్డలలో బంధువులలో చిక్కుకుని పోకుండా ఈ ప్రపంచమంతా మాయాజాలం, పట్టి మిథ్య, అని నిర్ధారణ చేసుకోవటం ఉపరతి. మనసు గురువు యడల విశ్వాసంతో ఉండటం శ్రద్ధ. ఆరవది సమాధానం. అంటే సుఖదుఖాలను సమానంగా భావించటం. మనసులో ఏ కొంచమైనా తపన, ఆవేదన లేక పోవటం, చిత్తం నిశ్చలంగా పర్వతంలా స్థిరంగా ఉండటం. ముముక్షుత్వమంటే జన్మ మరణాల బంధనం నుండి విముక్తి చెందాలని మనసులో బలీయమైన దృఢమైన మోక్ష కాంక్ష ఉండి, తదితర విషయాలను అసహ్యించు కోవడం. అపరోక్ష జ్ఞానానికి మార్గాన్ని అన్వేషించే వాడు ముముక్షువు. ముముక్షుత్వానికి యోగ్యత అనివార్యం అవసరం. మోక్షమంటే వైకుంఠమనుకునేవు సుమా! కాదు. మోక్షమంటే కైలాస పురం కూడా కాదు. ఈ మోక్షానికి మార్గం చాలా కఠినమైనది. ఈ విశ్వానికంతా ఆది కారణమైన శుద్ధ చైతన్యంతో తాదాత్మ్యం చెందటాన్ని మోక్షమని అంటారు. అట్టి శాశ్వతమైన మోక్షాన్ని అనేకరకాల ప్రయత్నాలతో సాధించటమే పురుషుని పురుషార్థం. మోక్షం తప్ప మిగతా అంతా



మిథ్య'' అని సాయి బోధించగా. వారి ప్రవచనాన్ని విన్న నానా చేతులు జోడించుకుని మరల ''బాబా! జగత్తుకు ఆధారమై, చరచరాలలో వ్యాపించి ఉండి, చివర జగత్తునంతా తనలో లయంచేసుకునే ఆశుద్ధ చైతన్యం ఎలా ఉంటుంది''? అని ప్రశ్నించాడు. ''మూల కారణమైన పరమాత్మతత్త్వమే శుద్ధచైతన్యం. కనిపించే ఈ జగత్తంతా కేవలం భాస మాత్రమే. చైతన్యం ఇది అని, ఇలా ఉంటుందని నిశ్చయంగా చెప్పలేం, కాని చైతన్యం ఉన్నట్లు గా అనుక్షణమూ సాక్ష్యం లభిస్తుంది. అనుభవం కల్గుతుంది. జగత్తులో చైతన్యం వ్యాపించని స్థానమంటూ ఎక్కడా లేదు. ఎంత వెదకినా చైతన్యం లేని ఒక వస్తువైనా లభించదు. నిర్దేశించి చెప్పటానికి చైతన్యమని అంటారే కాని దానికసలు నామ రూపాలేవీ ఉండవు. వాయువుకు రంగు రూపాలు ఎట్లా ఉండవో, అట్లే చైతాన్యానికి కూడా అవి ఉండవని తెలుసుకో. ఆ శుద్ధ చైతన్యాన్ని పర బ్రహ్మ అని అంటారు. జ్ఞానులు ఆ బ్రహ్మను ఉపాసిస్తారు. ఇట్టి ఉపాసకులను బ్రహ్మ వేత్తలని అంటారు. వృక్షకోటి, ప్రాణి కోటి, జీవ కోటి, జంతు కోటి అన్నీ ఈ చైతన్యం పొట్టలోనే ఉంటాయి. ఈ సకల దృశ్య జగత్తు కంతా ఆది కారణం ఈ ఒక్క చైతన్యమే. ఇది సర్వ వ్యాపకం. క్లేశరహితం. మరియు సత్య జ్ఞానానంద రూపం. మనమందరం

కూడా దాని కంటే భిన్నంగా లేము.'' అని తెలియ చేశారు బాబా. అప్పుడు నానా ''సద్గురు నాథా! సర్వవ్యాపక బ్రహ్మ క్లేశరహితమని, ఆనందరూపమని, ఆబ్రహ్మ అన్ని ప్రదేశాలలో వ్యాపించి ఉన్నాడని అన్ని పాత్రలలో నటిస్తున్నాడని అంటున్నారు కదా. ఇక్కడ నాకో సందేహం. దాన్ని నివృత్తి చేయండి దేవా! జగమంతా క్లేశ యుక్తం. అట్లే అనంతం. చైతన్య గుణాలు దానిలో అనుభవం కావు. పుట్టుగ్రుడ్డి సృష్టి లావణ్యాన్ని ఎలా చూడ గలడు? సత్యమైన చైతన్యం మిథ్యా జగత్తులో ఎలా ఉండగలదు? ఆత్మ యేచైతన్యమను కుంటే ఆత్మ అంతటా ఒక్కటే అన్నది పొరపాటు. ఆత్మ అనేకం. అన్యోన్యంగా ఉన్నవారికైనా తమతమ ఆత్మల యొక్క సుఖదుఖాల అనుభవాలు పరస్పరం కలగటం లేదు. అలాంటప్పుడు అందరిలో ఉన్నది ఒకే ఆత్మ ఒకే చైతన్యమని ఎలా అనగలం? శరీరాలు భిన్న భిన్నంగా ఉన్నట్లే ఆత్మకూడా విభిన్నంగా ఉండాలి కదా! ఆత్మ చైతన్యం కంటే వేరుగా ఉన్నట్లు అనిపిస్తుంది ఎందుకు? బాబా ''నానా నువ్విక్కడ పొరపడుతున్నావు. నేను చెప్పేది ఏకాగ్రమనసుతో శ్రద్ధగా విను. ఎరుపు తెలుపు నలుపు మరియు విశ్రమరంగులు నీలం పసుపు ఆకు పచ్చ నేరెడు పండు రంగు వీనిని విడి విడిగా నీళ్లలో వేసి వేరు వేరు

61

పాత్రలలో నింపి ఉంచినా, వెఱ్ఱివాడా! నీరు ఒక్కటే కదా, నీరు వేరు వేరుగా ఎలా ఉంటుంది? ఎరుపు రంగులో కలసి ఎఱ్ఱగాను, పసుపు రంగుతో కలసి పసుపుగా కన్పిస్తుంది. రంగుతో మిశ్రమం చేసిన నీరును వేరు పరిస్తే ఎరుపు, పసుపు రంగులు పోయి వట్టి నీరే మిగులు తుంది. అట్లే ఆత్మ హృదయం ఒక్కటిగా ఉన్నప్పుడు సుఖదుఖాలు అనుభవానికి వస్తుంటాయి. అనేక మానవులకు అనేక హృదయాలున్నా వాని అన్నింటిలోను సత్యంగా ఒకే ఆత్మ అభేధంగా ఉంది. సుఖదుఖాలు హృదయానికి మాత్రమే.ఆత్మకు కాదు. కళ్లకు కన్పించే హృదయం అసలు హృదయం కాదు. అది భావాలు ప్పొంగే పేటిక మాత్రమే. ఆత్మ ఒక్కటే చైతన్యం. ఆత్మ కారణంగానే హృదయంలోని భావ పరంపరలు. వత్సా! ఆ ఆత్మను గుర్తించు. నీకు బాగా అర్థమవటానికి, ఈ విషయాన్ని విడమర్చి విపులంగా చెప్పుతాను విను. పారమార్థికం వ్యావహారికం, ప్రాతి భాసి కమని చైతన్యం త్రిగుణాత్మకం. ఒకే శరీరానికి బాల్యం, యవ్వనం, వృద్ధాప్యాలున్నట్లే, చైతన్యం మూడు రకాలుగా ఉంటుంది. పారమార్థిక చైతన్యంతో ఉన్న ఆత్మ చాలా యోగ్యత గలది. ఇది సాధువుల యందుండే ఆత్మ. యోగ్యమైన చేయదగిన పనులను, నిషిద్ధ కర్మలను బాగా తెలుసుకుని శాస్త్రాను

62

సారంగా ప్రవర్తించే వారి యందు వ్యావహారిక చైతన్యముంటుంది. అజ్ఞానం కారణంగా అసత్యాన్ని సత్యంగా భావించే హరి యందు ప్రాతిభాసిక చైతన్య ముంటుంది. ఈ చైతన్యం ఉన్న అజ్ఞానునికి, వ్యావహారిక చైతన్యం ఉన్న సజ్జనునికి పారమార్థిక చైతన్యం ఉన్న సాధువునకు ఈ ముగ్గురికి కారణం ఆత్మ యే. రాజు. మంత్రి, రాజదూత, ఈ ముగ్గురిలో రాజ్యసత్తాయే ఐనా వీరిలో భిన్నత్వంలేదూ? రాజు ఆసీనుడవటానికి సింహాసనం, ఏనుగు, పల్లకీ వాహనాలు. రాజు తన ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించ గలడు. రాజాజ్ఞను అనుసరించి మంత్రులు అధికార వర్గం వ్యవహరిస్తారు. రాజు యొక్క ఇచ్ఛాను సారమే అందరూ నడుచు కోవాల్సి ఉంటుంది. తమ తమ ఇచ్ఛలకు అనుగుణంగా ప్రవర్తించడానికి వారికి అధికారం ఉండదు. ప్రభుత్వం యొక్క రాజ్య పాలన అనే ఆవరణలోనే ప్రజలంతా వ్యవహరించాల్సి ఉంటుంది. దీనికి కారణం ప్రభుత్వం. రాజు, మంత్రులు, రాజదూత, ప్రజ వీరందరికి అవలంబనం ప్రభుత్వం. రాజు, అధికారి, ప్రజ. వీరందరి కంటె ప్రభుత్వం భిన్నంగా ఉంటుంది. ఒక రాజు మరణిస్తే రాజ్యసత్తా నశించిపోదు. ప్రభుత్వం అధికారి భిన్నంగా కన్పిస్తారు. కాని ప్రభుత్వంతో తాదాత్మ్యం చెందటం వలన అధికారి, ప్రభుత్వపు సత్తాగా మారిపోతాడు.

63

ప్రభుత్వమెప్పుడూ ఏ పనిచేయదు. అయినా ప్రభుత్వం యొక్క అస్తిత్వంలో అన్ని పనులు జరుగుతుంటాయి. నువ్వు కూర్చున్న సీటు బలం ప్రభుత్వం పదవి వల్లనే. నీ బంట్రోతులు నీకు సేవలు చేయడం కూడా, ప్రభుత్వం యొక్క పదవి వల్లనే. నీ బంట్రోతుకు నీకు మీ ఉభయుల పదవులకు కారణం ప్రభుత్వం. ప్రభుత్వం యొక్క సంపూర్ణ అధికారలాంచనాలను రాజు పొందుతాడు. అధికారులు కొంత సత్తాను అనుభవిస్తే అంత కంటె తక్కువ సత్తాను జవానులు అనుభవిస్తారు. ప్రజలు మాత్రం ప్రభుత్వం యొక్క పరిపాలనా విధానంలో ఉంటారు. ఇదే విధంగా పారమార్థిక చైతన్యంలో ఉన్న ఆత్మ బ్రహ్మతో తాదాత్మ్యం చెంది పరమాత్మ సుఖాన్ని, పరిపూర్ణంగా అనుభవిస్తుంది. అని బాబా చెప్పారు. నానా సద్గురు సాయి ప్రవచనాన్ని విని, ప్రభుత్వం నిరవయవం కదా, దానికి ఇంద్రియా లెక్కడుంటాయి? అని వారిని ప్రశ్నించాడు. '' నానా భలే మంచి ప్రశ్నే వేశావు. ప్రభుత్వమంతా ఒక్కటే అభిన్నం.నిజమే కాని దానిలో విభాగాలుండవు. అట్లే అనంతమైన చైతన్యం కూడ . అయితే చైతన్య శక్తికి విభాగాలుండవు. అయినా గ్రాహకులు వారి వారి శక్త్యను సారం గ్రహిస్తారు. కుండలో, కూజాలో, కాగులో పెద్ద పాత్రలో ఈ అన్నింటిలో నిండి కూడా ఆకాశం

64

ఎప్పటి వలెనే ఉంటుంది. నదిలో ఎంతగా వ్యాపించి ఉందో అంత కంటె తక్కువ కుండలో, దాని కంటెనూ తక్కువ కూజాలోనూ ఉంటుంది. దీని వల్ల ఆకాశం అన్నిరకాలుగా విభాగాలైనట్లా? ఆత్మ స్వరూపం కూడా అట్లేనని బాగా తెలుసుకో. ఈ దృశ్య జగత్తంతా మాయా లీల. ఈ బ్రహ్మాండాన్ని మాయ బ్రహ్మ కలిసి సృష్టించారు అనిబాబా చెప్పగా నాన సాయిసమర్థా! ఈ మాయ అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? ఎలా నిర్మాణమైంది? జగత్తుకు ఆదికారణం చైతన్యమైనా జగత్తు చైతన్యం కంటె భిన్నం కాదు అని మీరు చెప్పారు కదా, మరి ఈ మాయ ఎలావచ్చింది? అని ప్రశ్నించాడు. బాబా "మాయ ఎట్లా ఉద్భవించిందో చెప్పతాను, ఏకాగ్రచిత్తంతో విను. చైతన్యం యొక్క శక్తి యే మాయ, ఇది చైతన్యాన్ని ప్రతి చోట నాట్యం చేయిస్తుంది. బెల్లాన్ని దానిలోని మాధుర్యాన్ని ఎలా వేరు చేయలేమొ అట్లే చైతన్యాన్ని మాయను వేరు చేయలేము. సూర్యుడు సూర్యుని ప్రభ, రెండూ ఒకే సూర్యుడైనా సూర్యుడు ప్రభ అని రెండు శబ్దాలు వాడుతాము. సూర్యుడు తన అస్తిత్వాన్ని, ప్రభా కిరణాల ద్వారా తెలియ చేస్తాడు. అట్లే బ్రహ్మ చైతన్యం మరియు మాయా చైతన్యం అంతు లేనిది. అనంతం. కాని మాయకు అంతం ఉంది. ఈ రెండూ అనాది నుండీ ఉన్నాయి.



అందువల్ల వీరికి ఆది లేదు. మాయ ప్రకృతి. చైతన్యం పురుషుడు. ఈ ప్రకృతీ పురుషుల నుండే జగత్తు యొక్క ఉత్పత్తి. ప్రకృతీ పురుషుల వివరణను అమృతానుభవంలోను మరియు మోహినీ రాజప్రసాద్‌లో జ్ఞాన రాజా విశదీకరించాడు. అందువల్ల నేను మరల ఆ విషయాన్ని చెప్పను. కేవలం, ఆత్మ జ్ఞాన గుహ యొక్క మర్మాన్ని తెలియ చేస్తాను. ఆగుహలోనికి వెళ్లిన వారెవ్వరూ తిరిగి గారు. కారణం ఆ గుహలో తాము కూడా గుహగా మారిపోయి ఆనందంలో తల్లీనులైపోతారు. పురుషుడు అన్నింటికీ కారణం. మాయ పురుషుని కార్యం. ఈ మాయ యొక్క మహిమ అగాధం. నేను సోమయ్య, రామయ్య, భీమయ్య అని తలపోయటం, మాయా కారణంగానే. మాయ చే కప్ప బడి ఉండటం వల్ల సత్యం కన్పించదు. మాయకు రెండు గుణాలున్నాయి. ఉన్నసత్యాన్ని కప్పిపెట్టటం, లేని దాన్ని ఉన్నట్లుగా భాసింపచేయటం. ఈ మాయా కారణంగానే జీవులు భ్రమిసి పోతుంటారు. ఒక కూలి వానికి తను రాజా అయి నట్లుగా స్వప్నం కల్గింది. ఇక్కడ మాయ కూలివాణ్ణి మరుగు పరచి, వాస్తవంగా లేని రాజపదవిని వానిపై భాసింపచేసింది. ఇదే విధంగా మాయ వాస్తవమైన బ్రహ్మను మరుగు పరచి నిజంగా లేని జగత్తును భాసింప చేస్తుంది. వాస్తవంగా ఈ జగత్తు అసలు

లేదు. నిత్యమైన ఒక్క చైతన్యమే సద్ వస్తువే ఉంది, కాని మాయా కారణంగా జగత్తు ఉన్నట్లుగా భాసిస్తుంది. జగత్తు జగత్తులోని వన్నీ సత్యంగా అసత్యమే, ఐనా వాస్తవంగా అగుపిస్తూ అశుభాలను కలుగ చేస్తాయి. అందు చేత, జ్ఞానంతో మాయ యొక్క ఆవరణను తొలగించుకుంటే అంతటా సర్వత్ర నేను నేనే అన్న శుద్ధ చైతన్యం గోచరిస్తుంది. నీటిలోని నాచు తొలగి పోతే, స్వచ్ఛమైన నీరు ఎలా కన్పిస్తుందో అట్లే మాయ యనే మాలిన్యాన్ని తొలగిస్తే చైతన్యం గోచరిస్తుంది. అందువల్ల నారాయణా (నానా) మీరందరు ఆసద్ వస్తువును ఉపాసించండని చెప్పుతున్నాను. సద్వస్తువైన ఆత్మ యే ఆధ్యాత్మ జ్ఞానానికి కారణం. అందు చేత ఆ ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది మీరు ఈ జన్మలోనే ముక్తులవండి''. అని బాబా బోధించారు. ఆ బ్రహ్మజ్ఞానాన్ని విని భక్తులు ఆనందంతో సాయి చరణాల యందు సాష్టాంగ వందనం చేసారు. వైద్యుడు, సాఠె, నానా చందోర్కరు, నానా నిమోంకరు, మారుతి లక్ష్మణ నూల్కరు మొదలగు వారిని తిలకించి సాయి మహారజా ''బిడ్డలారా! ఈ జ్ఞానాన్ని మనసులో బాగా గుర్తుంచు కొండి' అని చెప్పారు. భక్తులు సరేయని మరల మరల వారికి వందనం చేసారు. జ్ఞాన బాస్కరుడున్న చోట అంధకారానికి తావెక్కడిది? ఓ కృపారాసీ! సాయి



మాహారాజా! మీబిడ్డనైన దాసగణుని మీఒడిలోనికి తీసుకొని, మీకృపాఛాయలో కూర్చుండ బెట్టుకొండి. స్వస్తి శ్రీ సంతకథామృతంలో సాయి మహారాజాయనే మేఘం నుండి వర్షించిన జ్ఞానామృతాన్ని సేవించి తరించండని దాసగణు మనవి చేస్తున్నాడు.

శ్రీ దాసగణూకృత శ్రీ సంతకథామృతంలోని శ్రీ సాయిబాబా గురించిన

57వ అధ్యాయం సమాప్తం.

## శ్రీ సాయినాథ్ మహారాజ్‌కి జై

ప్రప్రథమంగా నిర్గుణ మరియు సగుణరూపంలో నున్న శ్రీమన్నారాయణునకు నమస్కారం. ముందుగా సగుణ మూర్తిని సేవిస్తేనే నిర్గుణ పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది కాని మొదట్లోనే నిర్గుణ పరబ్రహ్మ ప్రాప్తి సంభవం కాదు. ఆరంభంలో ఆ ఆలు, కఖలు అను అచ్చులను హల్లులను నేర్చుకుంటేనే శబ్దాలను జోడించుకునే జ్ఞానం కలుగుతుంది. అట్లే ఆధ్యాత్మ విద్యలో ముందు సగుణోపాసన అ ఆ లు కఖలు నేర్చుకోవటంవంటిది. వీనిని నేర్పించే గురువే ఈ భవ సాగరాన్ని దాటించే నౌక అని తెలుసు కోవాలి. గురు సేవే మొదటి మెట్టు. అయితే ఇటువంటి సేవ లభించటం చాలా కష్టం, కాని సద్గురు దేవుని అనుగ్రహాన్ని సంపాదించుకుంటే

వారి సేవా భాగ్యం సహజంగా సిద్ధిస్తుంది. భాస్కరుడు ప్రసన్నుడౌతే అతని ప్రకాశకిరణాలకు లోటుంటుందా? సద్గురు సేవ అనేకులు చేసినట్లుగా పురాణాలు సాక్ష్యం. పూర్ణబ్రహ్మజ్ఞానకీరవుణుడైన శ్రీరామచుడు వసిష్ఠునకు శరణాగతుడయ్యాడు. రుక్మిణీ వల్లభుడైన శ్రీకృష్ణపరమాత్మ, సందీపుని గురువుగా చేసుకున్నారు. అందు కని గురువువినా నరుడు 'రెండు కాళ్ల గాడిద' అని దాసగణు వక్కాణిస్తున్నాడు. భక్తి శ్రద్ధల వలననే సిద్ధి ప్రాప్తిస్తుంది. అందు వలన అ శ్రద్ధను మరియు అంతః కరణమాలిన్యాన్ని తొలగించు కోవాలి. ఇక్కడి మాటలు అక్కడ అక్కడివి ఇక్కడ చెప్పి కలహాలను కలిగించే కలహ భోజానుడు నారదుడు, భక్తి కారణంగానే ప్రహ్లాదుని తరింపచేశాడు. గోపీచందును కాళ్లనుండి తలవరకూ నిలవెల్లా పేడనలికి కప్పిపెట్టారు. అయినా అతడు మహాభక్తుడవటం వలన పూజనీయుడయ్యాడు. బంగారాన్ని గీటు రాయి పైన గీరి పరీక్షించిన తర్వాతే దానికి సువర్ణం విలువ అని దాసగణు మనవి చేస్తున్నాడు. క్షమా శాంతి దయ లున్నవారి వద్ద సంపూర్ణ జ్ఞానముంటుంది. పరమేశ్వరుని అభయ హస్తం, అనుగ్రహం ఉన్నవారినే సద్గురువుగా చేసుకొండి. దీపపు పురుగులు దీపాల కాంతికి దగాపడి పోయి తగల



పడి పోతాయి. హంసలు నీటిని వదిలి పాలను మాత్రం గ్రహించే విధంగా గురువును జాగ్రత్తగా ఎన్నుకోవాలి. బయటి పటాటోపాలను చూచి భ్రమపడకండి. రాళ్లురత్నాలు ఒక గని లోనే ఉండేవిధంగా బద్ధులు ముక్తులూ కూడా ఈ జగత్తులోనే ఉన్నారు, అయితే రత్న పరీక్షకులు బాగా పరికించి పరీక్షించి రత్నాలను గ్రహిస్తారు. కాని కోడి రత్నాన్ని కాళ్లతో త్రవ్వేసి తొక్కేస్తుంది. కారణం దానికి చెత్తయే మధురంగా ఉంటుంది. భాగ్యవంతులకే గురు చరణాల ఆశ్రయంలభిస్తుంది. క్షమా శాంతులతో కూడిన సద్గురు శ్రీసాయి బాబా భవాబ్ధిని దాటించటానికి శిరిడీలో (నౌకవలె) ఉన్నారు. వారు అనాథులకు తల్లి తండ్రి. వారికి శ్రీమంతులైనా లేక దిక్కు మొక్కు లేని దీనులైనా సమానమే. సూర్యుని ప్రకాశానికి చిన్న పెద్దలనే భేదముంటుందా; వీరు గంగా జలం వంటి వారు. అట్టి పవిత్ర గురుచరణాలకు గణు తనమస్తకాన్ని అర్పిస్తున్నాడు. మనశ్రేయస్సు కొఱకు, ఆధ్యాత్మజ్ఞాన మున్న మహాత్ముల వద్ద 'దీనంగా, వినయంగా ఉంటూ జ్ఞానాన్ని అభ్యసించాలి. చిన్న వయసు నుండే కథా మరి పెద్ద వారయ్యేది. సద్గురువు ఎరుపుగా ఉన్నా తెలుపుగా ఉన్నా నలుపుగా ఉన్నా వారి లీల అగాధం. సద్గురు సాయి నీటిని నూనెగా మార్చి ఎన్నో దీపాలను వెలిగించారు.

తల వద్ద కాళ్లవద్ద దీపాలనుంచుకుని ఒక చెక్క పలకపై శయనించే వారు. ఎప్పుడూ అంధకారంలో శయనించరాదని అర్థంకాబోలు. మాయ దుర్భగమైన అంధకారం. దాన్ని తొలగించుకోవటానికి జ్ఞాన దీపాన్ని వెలిగించు కోవాలని గణు విన్నవించు కుంటున్నాడు. సాయిబాబా బ్రహ్మవిష్ణుమహేశ్వర రూపుడు. ఈ సద్గురుని చరణ ధూళి పావన గంగా జలమని భావించండి. వారి ముఖం నుండి వెలువడే పదాలు గీతా వచనాలు. సాయి బాబా వసంత ఋతువు. భక్తులు కోకిలలై ఆ వసంతాన్ని ఆస్వాదించండి. పరమార్థాన్ని సాధించాలని కోరేవారు సాయి చరణాల నాశ్రయించండి. ఐహిక సుఖాలను త్యజించి భక్తిమార్గాన్ని అన్వేషించండి. ద్వేషాన్ని పారద్రోలి జగమంతా సాయి మయంలా చూడండి. అప్పుడే సజ్జనులైన మీరు బాబా భక్తులుగా శోభిస్తారని దాసగణు మనవి చేస్తున్నాడు.

శిరిడీ క్షేత్రం ప్రపంచంలోని సరుకుల నమ్మే బజారు కాదు. అక్కడి అంగడి వారు (బాబా) పరమార్థ వస్తువులను పంచి పెడతారు. ఐహిక సుఖాల కోసం ఉపయోగపడే వస్తువుల వల్ల పిల్లలు (భక్తులు) పాడైపోవటమే గాని ప్రయోజకులు కారని గురువు ఆటవస్తువుల వంటి ప్రాపంచిక వస్తువులను పారవేశారు. ఈ అంగడిలో



కర్మ భక్తిజ్ఞానమను వస్తువులుంటాయి. కోరుకున్న వస్తువును కొనుక్కోవచ్చు. మూడింటి వెల ఒక్కటే. మూడింటికి లభించె ఫలం కూడా ఒక్కటే. సాయి సద్గురువుకు భక్తి యనే ద్రవ్యమే గాని మరేదీ అవసరం లేదు. భక్తినాణెములున్న వారు ఈ అంగడికి వెళ్లగలరు. పరమాత్మ ప్రాప్తికై ప్రయత్నించే సాధకుడు ఈ మార్గంలో అవసరమయ్యే సద్గురు కృపయను సద్ది మూటను, తన వద్ద ఉంచుకోవాలి. తుకారం వద్ద అతని గురు కృపాప్రసాదం ఉండినది, అట్లే ఖేచర గురుకృప వలన నాందేవుకు విఠల పరబ్రహ్మ సాక్షాత్కారం కలిగింది. నివృత్తి జ్ఞానేశ్వరులు ఈశ్వరుని అవతారాలైనా గహినీనాథుని గురువుగా స్వీకరించారు. గురుకృపలేకుండా ఏ ఒక్కరైనా పరమాత్మను తెలుసుకోలేరు. పంఢరినాథుని తెలుసు కోవాలని ఆశించేవారు, సద్గురు చరణాలను దృఢంగా పట్టుకోవాలి. సద్గురు పాదాలను మనసున ధ్యానించే వారికి భవభయముండదు. శ్రీసాయి సద్గురువు శుకసనకనారద అంబరీష, నాథపంతు నివృత్తి జ్ఞానేశ్వర్ నాందేవు, జయదేవు తుకారం తులసీదాస్, చోఖామేళా, సావత మాళి, మెహతా బోధలా, కబీరు, పవార్, విసోబా ఖేచర గోరాకుంభార్ కూర్మదాసు, కోటి లోని వారు. వారి పాదాలలో లీనమై పోదాం పదండి. సత్పురుషుల ఆకారాలు

అదృశ్యమై పోయినా సాయి రూపంలో వారిని చూచు కోవచ్చు. త్రిభువనాలలో సత్పురుషులు ఎవ్వరైనా సరే వారు నాకు సాయి బాబాయే. సత్పురుషులు ప్రత్యక్ష పరమేశ్వరులు. వారి అనుగ్రముంటేనే పరమాత్ముని ప్రాప్తి. వారి యందు భేదబుద్ధి కలుగ కూడదు. దాసగణు సత్పురుషుల చరణాలకు అంకితుడు. సాయి సద్గురు విరాజమానులై ఉన్న ప్రదేశంలో గంగ భక్తిరూపంలో ప్రవహిస్తుంది. సాయి తమ హస్త సంకేతాలతో భక్తులను సంరక్షిస్తారు. అంచేత వ్యర్థంగా అడవులలో తిరగకండి. ''నేనెవర్ని? ఎక్కడి నుండి ఎందు నిమిత్తం శిరిడీ వచ్చానో గ్రహించండి. పంఢరీ క్షేత్రంలోని విఠోబాను నేనే. పంఢరీ ప్రభువును చేరుకునే మార్గం చాలా కఠినమైనది. మార్గంలో ముళ్ళుంటాయి. పైగా పెద్ద పర్వతాలు అడ్డుతగులుతాయి. ఆ అడ్డంకులను తొలగించే వజ్రం నావద్ద ఉంది. ఆ హృషీకేశుని తెలుసుకునే ఉపాయం నా వద్ద ఉంది. అనేక జన్మలనుండి నేనతన్ని ఎఱుగుదును. అందు వల్ల నన్ను సంప్రదించ కుండా (నా కృప లేకుండా) పంఢరీ ప్రయాణానికి ప్రయత్నం చేయకండిఅని సాయి మహారాజు చెప్పేవారు. దీని అర్థం సాయి సాక్షాత్తు జగన్నాథుని స్వరూపమని గ్రహించండి. ఈ సదవకాశాన్ని పోగొట్టు కొని పశ్చాత్తాపడకండి.



మీ అహంభావాన్ని దంభాన్ని మూట కట్టి మూల పడేయండి. అత్యంత ఘాతుకమైన వికల్పాన్ని విడిచి పెట్టండి. మీ క్రోధాన్ని జ్ఞానాగ్నిలో దహించి వేయండి. అభ్యాసంతో వాసనలను నశింపచేసుకొండి ఇట్టి వ్రతాలనాచరించే వారిని సాయి బాబా సంరక్షిస్తారు. మరల మరల మానవ జన్మలభించదు. అంచేత ఆయువును వ్యర్థంగా నష్ట పరచుకోకండి. ప్రతి జన్మలోనూ ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, ఆహారనిద్రాభయమైథునాలు. ఇవేగా– మానవజన్మ ఇటువంటి వానికోసం కాదని మనసులో నిశ్చయంగా గ్రహించండి. మానవ జన్మ మహత్తరమైనది. అందు చేత ఈ జన్మలోనే పరమేశ్వరుని శరణు పొందండని దాసుగణు మనవి చేస్తునాడు. కామక్రోధ లోభమోహాలను వదిలి సద్గురు చరణాలను ఆశ్రయించండి. కారణం గురువు వినా జన్మ సార్థకం కాదు. గురువు కామధేనువు. గురువు కల్పతరువు. చింతలను తొలగించే చింతామణి. గురు చరణాలలో సర్వం ప్రాప్తిస్తాయి. గురు భక్తియందు ఏకనిష్ఠగలవారు త్రిలోకాలలో శ్రేష్ఠులని దాసుగణు వక్కాణిస్తున్నాడు. సద్గురుని యందు భక్తి కలిగి ఉన్నట్లే పరమాత్ముని యందు కూడా ఉండాలి. అప్పుడే మోక్షం. మెడకో బండను కట్టుకుని సొరకాయ బుఱ్ఱను పట్టు కుంటే మాత్రం తీరానికి ఎలా చేరుకోగలరు?

గురువు శరీరమైతే శ్రీహరి ఆత్మ . ఉభయులలో భేదం లేదు. వారు అభిన్నులు. ఒకరిని అగౌరవ పరచి ఒకరిని ఆరాధిస్తే దుఃఖమే కలుగుతుంది. అందు చేత భక్తులారా! ఆ ఉభయుల యందు భక్తి కలిగి ఉండండి. సాయినాథుని పూజించండి. విఠ్ఠలుని కీర్తించండి. ప్రభుత్వాన్ని గౌరవించండి. పరమార్థ మందు భక్తి, ప్రపంచమందు విరక్తి, వ్యవహారంలో నీతి కలిగి ఉండాలని దాసగణు విన్నవించుకుంటున్నాడు. గురువును గూర్చి రచించిన ఈ పాతిక పద్యాలను పఠిస్తే పాతకాలు నశించి పోతాయి. గురువు యొక్క గుణగణాలను సంకీర్తన చేస్తే మోక్షం లభిస్తుంది. అందు చేత వ్యర్థమైన దురభిమానంతో గర్వాహంకారాలతో చావకండి. ఈ భవసాగరంలో మునిగి పోకండి, సాయినాథుని చేయూతతో తరించండి. సర్వం సాయి ఇచ్ఛానుసారమే జరుగుతుంది. సాయి యొక్క మహిమను వర్ణించడానికి దాస గణు వద్ద మాటలు లేవు.

శ్రీహరి హరార్పణమస్తు. శుభంభవతు.

## ప్రార్థనాష్టకం

కోటాను కోటి ఈ జన్మలెత్తినా క్షమా శాంతులు లేశమైనా లేక పోతే ఏం ప్రయోజనం?
నా చిత్తం మోహంతో ఆవరించుకు పోయింది. సాయినాథా! నన్నీమోహంనుండి విడిపిం
చండి ॥1॥ శివునిపై భయంతో పారి పోయిన కాముడు మమ్మల్ని మోసగించడానికి ఇక్కడికి
చేరుకున్నట్టుంది. పరమేశ్వరా ! సమర్థసద్గురూ! ఈ కాముడి బారినుండి నన్ను రక్షిం
చండి ॥ 2॥ ప్రతి చోటా దురాశా ప్రభావం కారణంగా మనసు స్థిరంగా నిశ్చలంగా ఉండదు.
సద్గురూ సాయినాథా! మీ చరణాలే మాకు తరుణోపాయం ॥3॥ గాడిదలకు పెంట కుప్పలు
మధురం అట్లే నాకీమాయా ప్రపంచంపై మమకారం ॥4॥ కన్నతల్లి ఉగ్గుపాలతో ఔషదాన్ని
రంగరించి పోసి పోషించే విధంగా సమర్థసద్గురూ! నాకు క్షమా శాంతులను ప్రసాదించండి.
ప్రభూ! సాయినాథా! మీకు నానమస్కారం ॥5॥ దేవా! మనసు వాసనలలో ఎప్పుడూ
చిక్కుపడిపోకుండా దాన్ని సదాసర్వదా ప్రశాంతంగా ఉంచండి. ఈజగత్తులో మాకు తల్లీ
తండ్రీ గురువు యైన సాయినాథా మీకు నా నమస్కారం ॥6॥ ఏది నాకు హితం ? ఏది శ్రేయాన్ని
కలిగించేదో నే నెఱుగను. నేను దేనిని తెలుసుకోవాలో దాని పై నామనసు నిలవదు. త్రాహి
త్రాహి అంటూ మీ శరణు జొచ్చాను. సాయినా థా! మీకు నా నమస్కారం ॥7॥ నాకు
యోగ్యమైనదాన్ని అనుగ్రహించండని అడిగే యోగ్యత నాకు లేదు. శిశువు తండ్రికి శిక్షణ
నివ్వగలడా? సాయినాథా ఈ దాసగణు చిత్తంలోని చింతలను నివారించండి. ప్రభూ? మీకు
నా నమస్కారం ॥8॥


76

ఎందుకంటే అడుక్కునే బిచ్చగాళ్లకు దయతో దానం ధర్మం చేయడంవేరు. అడగకుండానే ప్రేమతో పెట్టడంవేరు. అస్తమానం అడుక్కోవటం అసహ్యంకాదూ? అందువల్ల అసమానమైన భక్తిశ్రద్ధా విశ్వాసాలను, ప్రేమను లభ్యం చేసుకోవటానికి జీవితాంతం కృషి చేయాలి. మన అవసరాలు తీరటానికి శరీర రథాలు కదలటానికి (Fuel) ఇంధనం ధనం అత్యవసరమే కాని ధన సంపాదనే జీవిత లక్ష్యం కాకూడదు. **Money is means to an end.** If is not an end by itself. ధనం సాధనేగాని సాధ్యవస్తువుకాదు. ఆర్థికాభివృద్ధియే పరమార్థం కాదు; జన్మ సార్థకంకాదు.

**మూకం కరోతివాచాలం, పంగుంలంఘయతే గిరిం !**
**యత్కృపా తమహం వందే పరమానంద మాధవం.**

సర్వేజనాఃసుఖినోభవంతు !! సమస్త సన్మంగళాని భవంతు !!

77




ఓం నమో గురుభ్యో గురుపాదు కాభ్యో, ఓం నమః పరేభ్య పరపాదుకాభ్యోః!!
ఆచార్య సిద్దేశ్వర పాదుకాభ్యో, నమోనమః శ్రీ గురుపాదుకాభ్యః!!
కామాది సర్పవ్రజగారుడాభ్యాం, వివేక వైరాగ్యనిధి ప్రదాభ్యాం!!
బోధ ప్రదాభ్యాం ధృతమోక్షదాభ్యాం! నమోనమః శ్రీ గురుపాదుకాభ్యాం!!
అనంత సంసార సముద్రతార నౌకాయితాభ్యాం స్థిరభక్తిదాభ్యాం!!
జాడ్యాబ్ధి సంశోషణవాడవాభ్యాం! నమో నమః శ్రీ గురుపాదుకాభ్యాం!!

## సద్గురు శ్రీ సాయినాథ సగుణోపాసన (కు)

1. శ్రీ సాయినాథ స్తవన మంజరి
   దాసు గణు మరాఠి రచనకు తెలుగు అనువాదం రూ. 5-00
2. శ్రీ సాయినాథుని మరియు లక్ష్మి అష్టోత్తర రూ. 3-00
   శతనామావళి, హారతులు!
3. శ్రీ సాయినాథుని స్తోత్రములు,
   శ్రీ G. సత్యనారాయణ కవి విరచితం రూ. 5-00
   శ్రీ సాయినాథుని శతకం
   శ్రీ M. సుబ్రహ్మణ్య కవి విరచితం
4. శ్రీ దాసగణుకృత సాయిబాబా గూర్చిన 4 అ. లు. రూ. 7-00
5. శ్రీ సాయి సచ్చరిత (నిత్యపారాయణ గ్రంథం) రూ. 50-00
   మరాఠీ మూల రచనకు తెలుగు అనువాదం (580 పేజీలు)

ప్రచురణ: సద్గురు శ్రీ సాయి బాబా మందిరం, కిషన్ బాగ్,
హైదరాబాద్ - 500 264.
ప్రతులు : శిరిడీలోను పె మందిరంలోను లభించును.